కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ టోర్నీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, ఫిబ్రవరి 3: గులాబీ అధినేత, కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ. 50 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గుండు భూపేష్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీని అవమానించడం సరికాదు

చేర్యాల, ఫిబ్రవరి 3: మండలంలోని తాడూరులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఫ్లెక్సీని కాంగ్రెస్ నాయకులు అవమానించడం సరికాదని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అందె బీరన్న అన్నారు. సోమవారం నాడాయన ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల్లో విమర్శ ప్రతి విమర్శ సహజమని, కార్యకర్తలు, అభిమానులను రెచ్చగొట్టే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. చేర్యాల ప్రాంతంలో అభివృద్ధి అంశాలను పక్కన పెట్టి దాడుల సంస్కృతికి తెరలేపడం మానుకోవాలన్నారు. అధికారంలో ఉన్నామని ప్రతిపక్షంలో ఉన్న వారిని, పార్టీలను అగౌరవపర్చడం ఏమిటని ప్రశ్నించారు. చేర్యాల ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కక్షసాధింపు చర్యలకు దిగితే ఈ ప్రాంతం అభివృద్ధి కాకుండా పోతుందన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చేర్యాల, ఫిబ్రవరి 3: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 2001-2002 ఏడో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టయ్య, హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాఘవాపూర్‌లో క్యాన్సర్‌పై అవగాహన

మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేట, ఫిబ్రవరి 3: ప్రారంభ దశలో గుర్తిస్తే ఎలాంటి వ్యాధినైనా నివారించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో న్యాయ సేవాధికార సంస్థ, హెల్త్, పోలీస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ నారాయణ, రూరల్ సీఐ శ్రీనుతో కలిసి న్యాయమూర్తి స్వాతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి, వైద్యులు రాజేందర్, శ్రీనివాస్, గ్రామ నాయకులు సత్యం, రమేశ్ పాల్గొన్నారు.

లక్ష సూర్యనమస్కార ప్రదర్శన ప్రోమో ఆవిష్కరణ

లక్ష సూర్యనమస్కారాల పోటీల ప్రోమోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పల్వన్‌కుమార్

సిద్దిపేట, ఫిబ్రవరి 3: ప్రాచీన ఆరోగ్య విధానాలు, యోగాను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రపంచాన్ని నిర్మించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం శతసహస్ర సూర్య నమస్కార ప్రదర్శన, రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి ప్రోమోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆరోగ్య విధానాలు ప్రపంచానికి మార్గదర్శమన్నారు. ప్రజలందరూ యోగా సాధనను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. సిద్దిపేట వ్యాసమహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల మినీ స్టేడియంలో నిర్వహించే ఈ ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్జీవో భవన్ అధ్యక్షుడు అయిత అంజయ్య , జిల్లా సైన్స్ ఆఫీసర్ కల్లేపల్లి శ్రీనివాస్, యోగా శిక్షకులు తోట సంధ్య, సురేశ్, కవిత, సాయి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకుండా.. సంప్రదాయ పద్ధతిలో..

అరిటాకుల్లో భోజనం చేస్తున్న అతిథులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3: ఎక్కడైనా పెండ్లి గానీ, ఇతర శుభకార్యాలు జరిగినా ఆ ప్రాంతమంతా ప్లాస్టిక్, డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లతో నిండిపోతుంది. అలాకాకుండా సంప్రదాయ బద్ధంగా, పర్యావరణహితంగా ఆలోచించింది ఓ కుటుంబం. ఏమాత్రం ప్లాస్టిక్ వాడకుండా పూర్వకాలంలో చేసిన మాదిరిగా వివాహం జరిపించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. సిద్దిపేట పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షల్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రేమ్ చందర్ రెడ్డి, ఆకాంక్షరెడ్డిల పెండ్లి వేడుక పూర్తి సంప్రదాయబద్ధంగా జరిగింది. అతిథులకు అరటి ఆకుల్లో భోజనం పెట్టడంతో పాటు మట్టి పాత్రల్లో నీరు, ఐస్‌క్రీమ్ వంటివి వడ్డించారు. ఈ సందర్భంగా వరుడు తండ్రి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడటం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తున్నాయని, ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సంప్రదాయ పద్ధతిలో పెండ్లి వేడుక నిర్వహించడం జరిగిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన వెల్లువ


గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 3: కేంద్ర బడ్జెట్ సపన్న వర్గాలకు అనుకూలం, పేదలకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్, సంపన్న వర్గాలకు 3శాతం పన్ను రాయితీలు తగ్గించడం జరిగిందన్నారు. రూ.50లక్షల కోట్ల బడ్జెట్‌లో కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న ఎల్ఐసీ రంగాన్ని వందశాతం విదేశీ పెట్టుబడులకు, ప్రైవేటీకరణకు అనుమతులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వామి, వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంబురంగా బీఆర్ఎస్ జెండా పండుగ

నంగునూరు: అక్కెనపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణరావుపేట: జక్కాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు,నారాయణరావుపేట మండలాల్లో బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణ

నంగునూరు, ఫిబ్రవరి 3: మండలంలోని అక్కెనపల్లి, గట్లమల్యాల, సంతోష్‌నగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గుండు భూపేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు. ఈ మేరకు బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, వేముల వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో...

నారాయణరావుపేట, ఫిబ్రవరి 3: అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని నారాయణరావుపేట మండల ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. మండలంలోని జక్కాపూర్, గోపులాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

వసంత వైభవం

- చదువులతల్లికి జననీరాజనం
- అమ్మవారిదర్శనంతో పులకించిన భక్తజనం

మిరుదొడ్డి: మోతెలో పూజలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వర్గల్: సరస్వతీమాతను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

వర్గల్, ఫిబ్రవరి 3: మండలంలోని చదువుల తల్లి సరస్వతీమాత ఆలయం సోమవారం వసంతపంచమి వేడుకలతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు వేకువజామునే అమ్మవారి మేలుకొల్పుతో విశేషపంచామృతాభిషేకం, యాగశాలలో హోమం, విశేషాలంకారసేవ, గిరిప్రదక్షిణం, లక్షపుష్పార్చన, కుంకుమార్చన, లలితాసహస్రపారాయణం, వేదపఠనం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకార్యాలు కలుగకుండా ఆలయ పాల కమండలి సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు

వసంత పంచమి వేడుకల్లో బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 3: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జెన్నారెడ్డి, రాజేశ్వర్, రమేశ, రవి పాల్గొన్నారు.

సరస్వతీ మాతకు పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 3: అర్జున్ పట్ల ఉన్నత పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతీ మాత విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగ ప్రసాద్, రామచంద్ర మూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3: సిద్దిపేట విద్యానగర్ కాలనీలో వెలిసిన షిర్డీసాయిబాబా ఆలయంలో స్వామి వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు, హోమం నిర్వహించారు. పురవీధుల గుండా స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సిద్దిపేట 42 వార్డు కౌన్సిలర్ కాటం శోభారఘురామ్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.

తడ్కపల్లిలో...

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3: మండలంలోని తడ్కపల్లిలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలోని సరస్వతీ ఆలయంలో వసంత పంచమి వేడుకలు జరిగాయి. ముందుగా గాయత్రి యజ్ఞంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆవాస విద్యాలయం కార్యదర్శి నారాయణ, సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, పాఠశాల అధ్యక్షుడు శేఖరం, సహ కార్యదర్శి లింగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో...

మర్కూక్, ఫిబ్రవరి 3: మండలంలోని కర్కపట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన మానుక ఆంజనేయులు విగ్రహం, సార గణేశ్ గద్దె నిర్మాణం, శ్రీశైలంయాదవ్ పాఠశాలకు కంప్యూటర్ బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో అన్నదానం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3: వసంత పంచమిని పురస్కరించుకొని సిద్దిపేట వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అభయ జ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో ముక్క నాగరాణి, నరేందర్ సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ హరి, క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్, వనితా అధ్యక్షురాలు మంజులారవి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 3: ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను వేరుచేసి ఇస్తేనే ఇండ్ల నుంచి సేకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని డీఆర్‌సీ, ఎఫ్‌ఎస్‌టీపీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో చెత్తను సేకరించే డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు అనేకసార్లు చెత్తపై అవగాహన కల్పించినప్పటికీ వేరుచేయకుండా ఇవ్వడం ఏమిటని వారిని ప్రశ్నించారు. చెత్తను వేరు చేసి ఇవ్వాలని, ఇవ్వని పక్షంలో చెత్తను సేకరించవద్దని వారికి సూచించారు. రహదారులపై చెత్త పడేసేవారికి జరిమానా విధిస్తామన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

8, 9న రచయిత్రుల వేదిక జాతీయ సదస్సు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3: సిద్దిపేట విపంచి కళా నిలయంలో ఈనెల 8, 9న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు రచయిత్రుల వేదిక ప్రతినిధులు అనిశెట్టి రజిత, విద్యుహే, రామలక్ష్మి, శాంతిప్రబోధ, షహనాజ్ బేగం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సదస్సు కరపత్రాన్నివారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..కళా నిలయంలో తెలుగు సాహిత్యం, అంబేద్కర్ ప్రభావం అనే అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు అల్లం నారాయణ, నందిని సిధారెడ్డి, ఆచార్య మధుజ్యోతి, జిలకర శ్రీనివాస్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజాస్వామిక రచయిత్రులు, వేదిక నాయకులు హాజరవుతారన్నారు.

కొండపోచమ్మకు పోటెత్తిన భక్తులు


కొండపోచమ్మ దేవాలయం ఆవరణలో ఘటం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జగదేవపూర్, ఫిబ్రవరి3: మండలంలోని తీగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సోమవారం ఉదయం అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు సుమారు రెండు గంటల పాటు బారులు తీరారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.హైదరాబాదుకు చెందిన సాయియాదవ్ సంఘం ఆధ్వర్యంలో బోనం, ఘటం, ధూంధాం నిర్వహించారు. లేజర్ షో, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించారు. అంతకు ముందు వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఎస్సై చంద్రమక్షన్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. మాజీ సర్పంచ్ రజితారమేశ్, నాయకులు కృష్ణయాదవ్,శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న శివగారి అంజయ్య

చేర్యాల, ఫిబ్రవరి 3: చేర్యాల పట్టణానికి చెందిన కందూరి యాదమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను నుంచి మంజూరైన రూ. 19,500 చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు సోమవారం బీఆర్ఎస్ నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేవిధంగా కృషి చేస్తున్నదన్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టౌన్ యూత్ అధ్యక్షుడు యాట భిక్షపతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవర చంద్రారెడ్డి, బియ్య శీను, పాక వెంకటయ్య, పాక చెన్నయ్య, కందూరి నర్సయ్య పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బందారం గ్రామస్తులు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 3 : కొండపాక మండలంలోని బందారంలో నిలిచి పోయిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సోమవారం గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి రింగు రోడ్డు వేశారని, దానిలో భాగంగా గ్రామంలోని పాత రోడ్డుకు కంకరపోసి వదిలిపెట్టడంతో పాటు డ్రైనేజీని తొలిగించడం వల్ల మురుగు సమస్య నెలకొందన్నారు. వెంటనే అసంపూర్తిగా మధ్యలో వదిలిపెట్టిన పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్ట్‌షాపులు తొలిగించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 3: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తొలిగించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫీ డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు మండలంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా, సమయపాలన లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మద్యం తాగి ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు కనకయ్య, జక్కుల ఎల్లయ్య, శాంసన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ధూళిమిట్టలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముస్త్యాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేందర్ తదితరులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ తలపెట్టిన లక్ష డప్పులు-వెయ్యి గొంతుల సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ధూళిమిట్ట మండల ఇన్‌చార్జి సుందరగిరి భాస్కర్ కోరారు. సోమవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు-వెయ్యి గొంతుల సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు, ఉపకులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఎదిగేందుకు ఎస్సీ వర్గీకరణే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల రాజేశ్, అధికార ప్రతినిధి నాగులపల్లి సంపత్, ఉపాధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి పోతరాజు చిన్న కనకయ్య పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లో ఈనెల 7న మందకృష్ణ మాదిగ చేపట్టనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుల సాంస్కృతిక ప్రదర్శన సభకు మాదిగలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పెద్దింటి మహేందర్ కోరారు. లక్ష డప్పులు- వెయ్యి గొంతుల కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ముస్త్యాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి సొంటె విక్రమ్, ప్రధాన కార్యదర్శి గూడెపు హరి, నాయకులు ఉదయ్‌కుమార్, రాజ్‌కుమార్, వెంకటేశ్, శివకుమార్, శ్రీకాంత్, చందు, మైసయ్య, రమేశ్, నాగేశ్, బాబురావు, సాగర్, ప్రశాంత్, కిష్టయ్య పాల్గొన్నారు.

నంగునూరులో...

నంగునూరు, ఫిబ్రవరి 3: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం హైదరాబాద్‌లో ఈనెల 7న జరుగనున్న లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం నంగునూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని రీతిలో గొప్ప సాంస్కృతిక కళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, యాదయ్య, నరేశ్, కనకయ్య, భూమయ్య పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాల తుది జాబితా ప్రదర్శన

ఎంపీటీసీ స్థానాల తుది జాబితాను ప్రదర్శిస్తున్న సిబ్బంది

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 3: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని ఎంపీటీసీ స్థానాల తుది జాబితాను ప్రదర్శించినట్లు మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ తెలిపారు. సోమవారం మద్దూరు మండల పరిషత్, ధూళిమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తుది జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దూరు మండలంలో 7, ధూళిమిట్టలో 5 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపారు. మద్దూరు మండలంలో 1)అర్జున్ పట్ల, కమలాయపల్లి, 2) గాగిల్లాపూర్, నర్సాయపల్లి, వల్లంపట్ల, 3)రేబర్తి, వంగపల్లి, 4)మద్దూరు, 5)లద్నూర్, ధర్మారం, 6)సలాఖపూర్, 7)మర్మాముల, ధూళిమిట్ట మండలంలో 1)జాలపల్లి, లింగాపూర్, 2)ధూళిమిట్ట, 3)బెక్కల్, తోర్నాల, 4)కొండాపూర్, దుబ్బతండా,హనుమతండా, కూటిగల్, రెడ్యానాయక్‌తండా, 5)బైరాన్‌పల్లి ఎంపీటీసీ స్థానాలతో తుది జాబితాను రూపొందించినట్లు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 3: వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మద్దూరు తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్‌గఫూర్ రహీం అన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 3వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా ఎన్నికల ర్యాలీలు, ప్రచారాలు నిర్వహించవద్దన్నా రు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన చిహ్నాలు, జెండా లు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఉమ్మడి మండలంలోని ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా మద్దూరు హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పుస్తె మెట్టెల పంపిణీ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3: నిరుపేద వధువు పెండ్లికి సిద్దిపేట అలయన్స్ క్లబ్ చేయూత ఇచ్చింది. క్లబ్ అధ్యక్షురాలు యంసాని హైమవతి ఆధ్వర్యంలో వినయ్ కుమార్, శ్రావణి దంపతుల సహకారంతో వధువు వర్ష వివాహానికి సోమవారం పుస్తె మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మారాములు, బాలచంద్రం, రమాదేవి, యాదగిరి, లావణ్య పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని వినతి

ములుగు, ఫిబ్రవరి 3 : రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం వెంటనే చెల్లించాలని పరిహారం అందని ముంపు గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ములుగులోని తహసీల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముంపు గ్రామస్తులు వినతిపత్రం అందజేయడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కుటుంబ కలహాలతో భార్యపై భర్త దాడి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 3 : కుటుంబ కలహాలతో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మాదన్నపేటలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గండికోట మలవ్వ, మలయ్య దంపతుల కుమార్తె సంతోషను సిద్దిపేటకు చెందిన భాస్కర్‌కు ఇచ్చి వివాహ చేశారు. కొన్నేండ్లుగా వీరి కాపురం సజావుగానే సాగడంతో వారికి కుమారుడు, కూతురు జన్మించారు. ఇదే క్రమంలో భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండడంతో తల్లిగారి ఊరు మాదన్నపేటకు వారం రోజులు కిత్రం సంతోష వచ్చింది. ఈ నెల 1వ తేదీ న రాత్రి భాస్కర్ మాదన్నపేట వచ్చి కూతురును ఎత్తుకొని వెళ్లాడు. సోమవారం సాయంత్రం మాదన్న పేటకు వచ్చిన అతడు భార్య సంతోషపై కమ్మకత్తి (కొడవలి)తో దాడి చేయడంతో గాయాలయ్యాయి. భాస్కర్‌ను గ్రామస్తులు అడ్డుకొని చికిత్స నిమిత్తం సంతోషను 108లో సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు.